క్లుప్తంగా

రూ.1.5లక్షల ఎల్‌ఓసీ అందజేత



వెంకటేశ్ గౌడ్‌కు ఎల్‌ఓసీ పత్రం అందజేస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరరంజన్‌రెడ్డి అన్నారు. ఎంపీపటేల్‌గూడకు చెందిన కొత్త వెంకటేశ్ గౌడ్.. వైద్య ఖర్చుల కోసం చైర్మన్ మర్రిని సంప్రదించగా.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో బుధవారం ఆయన బాధితుడికి రూ.1.5 లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. అనంతరం మాట్లాడారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా తనను సంప్రదించాలని మర్రి సూచించారు.

మేడికుంటకు తాత్కాలిక మరమ్మతు



జేసీబీ సహాయంతో గండి పూడ్చివేయిస్తున్న అధికారులు

ఆమనగల్లు: కడ్తాల్ మండల కేంద్రంలో మంగళవారం మేడికుంట చెరువుకు గండి పడిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో నీరు వృథాగా పోకుండా బుధవారం అధికారులు జేసీబీ సహాయంతో మట్టిని పోయించి తాత్కాలిక మరమ్మతులు చేయించారు. చెరువు మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో కడ్తాల్ తహసీల్దార్ ముంతాజ్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎర్రోళ్ల



రాఘవేందర్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

ఆమనగల్లు: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన ఎర్రోల్ల రాఘవేందర్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య రాఘవేందర్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎర్రోల్ల మాట్లాడుతూ.. తనను నియమించిన ఆర్.కృష్ణయ్య, సహకరించిన కృష్ణ, నందగోపాల్, ఉదయ్‌కుమార్, నీలం వెంకటేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు బీఆర్‌ఎస్ రైతు ధర్నా

మహేశ్వరం: రుణమాఫీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేసిందని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. పార్టీ పిలుపు మేరకు గురువారం మండల కేంద్రంలో బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్ చౌరస్తాలో రైతు ధర్నా పేరుతో నిరసన చేపట్టనున్నామని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరు కానున్నారని పార్టీ శ్రేణులు తెలిపారు. ధర్నాలో మండల పరిధి పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రుణమాఫీ.. మోసం

తుక్కుగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను రుణమాఫీ పేరుతో మోసం చేసిందని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. నిరసనగా.. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మహేశ్వరం మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలి వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు పార్టీ తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మయ్య తెలిపారు.

కరాటే పోటీల్లో కార్తీక్ గౌడ్ ప్రతిభ

బంగారు పతకం కైవసం

మహేశ్వరం: షాద్‌నగర్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మండల పరిధిలోని మన్సాన్‌పల్లికి చెందిన పి.కార్తీక్ గౌడ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించారు. మాస్టర్ మల్లేశ్ యాదవ్ జ్ఞాపకార్థంగా జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వైష్ణవి టెక్నో స్కూల్లో చదువుకుంటున్న విద్యార్థి గోల్డ్‌మెడల్ సాధించడం గర్వకారణమని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి అనేక పతకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎన్నాళ్లీ కంకర రోడ్డు కష్టాలు

- ఏడాదిగా ముందుకు సాగని నిర్మాణ పనులు
- ఇబ్బంది పడుతున్న గిరిజనులు

మంచాల: తండాకు రోడ్డు సౌకర్యం కల్పించండి మహాప్రభో అని గిరిజనులు సుదీర్ఘకాలం పాటు వేడుకున్నారు. ఫలితంగా అధికార యంత్రాంగం కదిలింది. కావాల్సిన నిధులు మంజూరు చేసింది. ఏడాది క్రితం పనులకు ప్రారంభించింది. కంకర పోసి వదిలేసింది. కానీ.. ఏడాది గడిచినా ఎక్కడి గొంగళి అక్కడేనన్న చందంగా రోడ్డు పనులు ముందుకు సాగడం లేదు.

పట్టించుకోని పాలకులు

మండల పరిధి ముచ్చర్లకుంట తండా.. ఒక్కప్పుడు ఆరుట్ల అనుబంధ గ్రామం. నేడు పటేల్ చెరువు తండా అనుబంధ గ్రామంగా మారింది. ఆరుట్ల నుంచి పటేల్ చెరువుతండా వరకు రోడ్డు సౌకర్యం ఉంది. పటేల్ చెరువుతండా నుంచి ముచ్చర్లకుంట తండాకు రోడ్డు లేదు. నాడు గుట్టల మధ్యన పూరి గుడిసెలతో విసిరేసినట్లుగా ఉన్న తండాకు.. దివంగత నేత వైయస్ రాజశేఖరరెడ్డి పుణ్యమా గుడిసెలు కాస్త.. ఇందిరమ్మ ఇళ్లుగా మారాయి. తాగునీటి సౌకర్యం కల్పించారు. తదనంతరం వచ్చిన ప్రభుత్వాలు గిరిజన తండాను పట్టించుకోలేదని, నేటికీ రహదారి సౌకర్యం కల్పించడంలో విఫలమయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పనులు ప్రారంభించి..

గిరిజనుల విన్నపాలతో గతేడాది అక్టోబర్‌లో (ఎస్టీ–ఎస్‌డీఎఫ్) ఎస్టీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ.2 కోట్ల 90 లక్షలతో 4 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించారు. పనులు ప్రారంభించారు. కంకరపోసి వదిలేశారు. ఏడాది కావస్తున్నా.. పనులు ముందుకు సాగడం లేదు. దీంతో రోడ్డు కల నెరవేరుతుందని భావించిన గిరిజనులకు నిరాశే మిగిలింది. కంకర రోడ్డులో ప్రయాణించలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇదే విషయంపై సంబంధిత ఏఈఈ హరి నాయక్‌ను వివరణ కోరగా.. రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించడానికి ఎస్టిమేషన్ పంపామని, వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు.



ముచ్చర్లకుంటతండా రోడ్డు దుస్థితి

ఇబ్బందిగా ఉంది..



రహదారి నిర్మాణ పనులు ఆగిపోయి ఇబ్బందిగా మారింది. ద్విచక్ర వాహనాల్లో కాదు కదా.. కనీసం కాలి నడకన వెళ్లలేని దుస్థితి నెలకొంది. ప్రమాదాలు జరిగి పలువురు ఆస్పత్రి పాలయ్యారు. ఎన్నాళ్లు మాకు రోడ్డు కష్టాలు. దారి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయండి.

– ఉదావత్ మత్రు నాయక్, ముచ్చర్లకుంటతండా

విన్నవిస్తూనే ఉన్నాం..



పటేల్ చెరువుతండా నుంచి ముచ్చర్లకుంటతండాకు రోడ్డు నిర్మాణ పనుల గురించి అధికారులు, ప్రజాప్రతినిధులు అనేక సార్లు విన్నవించాం. త్వరగా పూరి చేయాలని విన్నవిస్తూనే ఉన్నాం. అయినా ఎవరూ స్పందించడం లేదు. ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకొని రోడ్డు పూర్తి చేయాలి.

– మేగావత్ రాజు నాయక్, మాజీ సర్పంచ్, పటేల్‌చెరువుతండా

ఆలయాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి: శిథిల ఆలయాల మరమ్మతులతో పాటు నూతన దేవాలయాల నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను హైదరాబాద్‌లో కలిశారు. పోచమ్మ ఆలయానికి ప్రహరి నిర్మించాలని కోరారు. దీనికి స్పందించిన ఆయన రూ.5 లక్షల ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తితో ముక్తి, మోక్షం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్ యాదవ్, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ అజీం, మైనార్టీ మండల అధ్యక్షుడు ఆరీఫ్, గ్రామ అధ్యక్షుడు తుమ్మ నర్సింహ్మా, పురుషోత్తం, శ్రీను పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ

మాడ్గుల: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధి నల్లవారిపల్లి గ్రామానికి చెందిన నాయకులు విజయారెడ్డి, పెద్దయ్య, మల్లయ్య, సంపత్‌కుమార్‌లు ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. పలు సమస్యలు పేర్కొంటూ వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. గ్రామానికి యథావిధిగా ఆర్టీసీ బస్సులను నడిపించాలని, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని, రైతులందరికీ రుణమాఫీ అందేలా చూడాలని పేర్కొన్నారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. రుణమాఫీ విషయంలో అన్నదాతలు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ లబ్ధిచేకూరుస్తుందని తెలిపారు. ప్రతిపక్షాలు కావాలనే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తూ రైతులను రెచ్చగొడుతున్నాయని విమర్శించారు. వారి మాటలను రైతులు నమ్మేస్థితిలో లేరని చెప్పారు.



ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

బురద దారి.. పడతారు జారి



బురదను చూపుతున్న కాలనీ ప్రజలు

- సాయినగర్ కాలనీకి రోడ్డు, డ్రైనేజీ సౌకర్యం నిల్
- ఇళ్ల మధ్యే నిలుస్తున్న వర్షపు నీరు

యాచారం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సాయినగర్ బురదమయంగా మారింది. డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో వరద నీరు ఇళ్ల మధ్యే నిలిచిపోతోంది. మట్టిరోడ్డు కావడంతో బురదగా మారి.. స్థానికులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది. దీంతో బురదలో ఎలా నడవాలని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, ఇళ్లల్లోకి బురద వస్తుందని, జారి పడుతున్నామని వాపోతున్నారు. ఏటేటా ఇంటి పన్ను వసూలుకు వచ్చే అధికారులకు కాలనీకి సీసీరోడ్డుతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. రూ.10 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ కాలువ నిర్మాణ పనుల జాప్యంతోనే తాము ఈ కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇదే విషయమై అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి డ్రైనేజి నిర్మాణం త్వరగా పూర్తిచేసి, బురద గండం నుంచి తప్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

చెరువుల పరిరక్షణ మీదే..

- అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలి
- ఆక్రమణలకు గురైతే సహించేది లేదు
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురికాకుండా చూడాల్సిన, కాపాడాల్సిన బాధ్యత అధికారులదేనని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం పట్నం ప్రజాభవన్‌లో రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్లాట్ల క్రమబద్ధీకరణను పారదర్శకంగా చేపట్టాలని పేర్కొన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీకి రూ.వంద కోట్ల నిధులు మంజూరు చేయించానని ఎమ్మెల్యే చెప్పారు. నియోజకవర్గంలో అవసరమైన కొత్త రోడ్ల ప్రతిపాదనలు రూపొందించి అందజేయాలన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఫార్మాసిటీ రద్దు చేయించామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారని వెల్లడించారు. సిటీ నిర్మాణంతో నియోజకవర్గానికి మహర్దశ పట్టనుందన్నారు. అందుకు అనుగుణంగా ఫ్యూచర్ సిటీకి అనుసంధానంగా రోడ్లను అభివృద్ధి పర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్డీఓ అనంతరెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సునీత, మున్సిపల్ కమిషనర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ కోసం హెల్ప్‌డెస్క్

ఇబ్రహీంపట్నం రూరల్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన, పరిష్కారం కోసం ఆదిబట్ల మున్సిపాలిటీలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పురపాలక పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్‌పై ఎలాంటి సందేహాలు, సమస్యలు ఉన్నా.. టౌన్ ప్లానింగ్ అధికారి ఎస్.అబీబ్ ఉన్నీసా 8328396716, డెస్క్ ఇన్‌చార్జి భాస్కర్ 9391122665, టౌన్ ప్లానింగ్ సెక్షన్ అసిస్టెంట్ వంశీ 6303782905 అధికారుల నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నియామకం



రాంకిషన్

ఆమనగల్లు: బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మాడ్గుల మండలం ఆర్కపల్లి గ్రామానికి చెందిన రాంకిషన్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షుడు మహేందర్ రాంకిషన్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు ఆచారి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, పలువురు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కళాశాల భవనం పనులు పూర్తిచేయాలి

ఇబ్రహీంపట్నం: నూతన డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రిన్సిపాల్ రాధిక కోరారు. ఈ మేరకు బుధవారం ఆమె అధ్యాపకులతో కలిసి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. కళాశాల భవనాన్ని త్వరగా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు ఫోన్‌లో చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు సురేష్, డీవి రావు, రాకేష్, భవాని, శంకర్, ధన్‌రాజ్, కృష్ణ, పవన్, నరేందర్‌రెడ్డి, రాజులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి 31వ డివిజన్‌లోని బాలాజీనగర్ కాలనీలో బుధవారం సీసీరోడ్డు నిర్మాణ పనులను మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. అన్ని డివిజన్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులు వేగంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గణేశ్ నవరాత్రులను పురస్కరించుకుని రోడ్లపై ప్యాచ్ వర్కులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఏఈఈ బిక్కు నాయక్, కొండా శ్రవణ్‌కుమార్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్యసమావేశం

మేయర్ పారిజాతరెడ్డి అధ్యక్షతన కార్పొరేషన్ హాల్లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆర్వో వేణుగోపాల్‌రెడ్డి అంశాలను సభలో ప్రవేశపెట్టారు. సుమారు రూ.47.63 కోట్లతో, 15వ ఫైనాన్స్ నిధులు రూ.3.80 లక్షలు ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ శేఖర్, కమిషనర్ జి.రఘుకుమార్, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం



పూజలో పాల్గొన్న ఆలయ చైర్మన్ వెంకటయ్య, భక్తులు

ఆమనగల్లు: కట్టమైసమ్మ విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని సురసముద్రం చెరువుకట్టపై పునర్నిర్మించిన మైసమ్మ ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే వేడుకలు.. మహాగాయత్రి ఉపాసకులు నారాయణ ప్రత్యంగిరాదేవి ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా అంకురార్పణ, గంగామాత పూజ, గణపతి పూజ, అఖండ ప్రజ్వలన, పుణ్యాహవాచనం, అమ్మవారి విగ్రహ అభిషేకం తదితర కార్యక్రమాలను పూజారులు బాల బ్రహ్మచార్యులు, బసవేశ్వరశాస్త్రి, నాగరాజశర్మల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మక్తాల వెంకటయ్య, మాజీ ఎంపీపీ తల్లోజు లలిత, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, స్థానిక నాయకులు తల్లోజు వెంకటయ్య, ఎంగలి రఘు, అంజయ్య, చిన్న వెంకటయ్య, ఎర్రవోలు రాజు, కేకే.శ్రీను, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే సబితారెడ్డికి సమస్యలు వివరిస్తున్న నర్సింగ్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీలోని 18వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీఆర్‌ఎస్ వార్డు అధ్యక్షుడు గుండు నర్సింగ్.. మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డికి విన్నవించారు. శ్రీరాం కాలనీలో శ్వశాన వాటిక లేకపోవడంతో ఆఖరి మజిలీకి ఇబ్బందులు తప్పడం లేదన్నారు. విద్యుత్ స్తంభాలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో రాత్రి పూట అంధాకారం నెలకొంటుందన్నారు. జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించాలని పేర్కొన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించేలా మున్సిపాలిటీ అధికారులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

స్పోర్ట్స్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా మహేందర్

కందుకూరు: బీజేవైఎం స్పోర్ట్స్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా మండల పరిధిలోని ముచ్చర్లకు చెందిన ఊటు మహేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ కళాశాల స్థాయి నుంచే ఏబీవీపీతో పాటు బీజేపీలో పలు బాధ్యతలు నిర్వహించి ఎన్నో ఉద్యమాల్లో పాలు పంచుకున్నానని పేర్కొన్నారు. తనకు బీజేవైఎం రాష్ట్ర స్థాయిలో పదవి అప్పగించినందుకు అధ్యక్షుడు మహేందర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తదితరులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న నేతలు

తలకొండపల్లి: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు సంక్రమించవని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. బుధవారం మండల పరిధి వెల్జాల్‌లో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా.. మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రవి కుమార్, జిల్లా పరిషత్ మాజి కో ఆప్షన్ సభ్యుడు ఎండీ ముజిబర్ రహ్మన్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. డాక్టర్ అఖిల్, హైదరాబాద్ కామినేని ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో 461 మంది రోగులకు బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, జలుబు, దగ్గు, గొంతు నొప్పి, వైరల్ ఫీవర్ తదితర వ్యాధులకు పరీక్ష చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అంబాజీ, మాజీ ఉప సర్పంచ్ అజీజ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవి, డైరెక్టర్ శేఖర్, నరేందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, విజయ్ కుమార్, లక్ష్మీ నారాయణ, శ్రీను, శ్రీశైలం, మనోహర్, వెంకటయ్య, సాయి, యువకులు, వైద్య సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విభజించి పాలిస్తున్న కేంద్రం



ధర్నాలో పాల్గొన్న మాల మహానాడు నాయకులు

- వర్గీకరణను విరమించుకోవాలి
- మాల మహానాడు నాయకుల డిమాండ్

తలకొండపల్లి: ఎస్సీ,ఎస్టీ వర్గీకరణతో తమకు అన్యాయం జరుగుతుందని, వర్గీకరణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకోవాలని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. విభజించు పాలించు విధానాన్ని పాటిస్తూ.. కేంద్రం కులాల మధ్య చిచ్చు పెడుతుందని ఆరోపించారు వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును నిరసిస్తూ 'రిజర్వేషన్ బచావో' సంఘర్ష్ సమితి పిలుపు మేరకు బుధవారం భారత్ బంద్‌ను పాటించారు. ఈ సందర్భంగా ధర్నా, ర్యాలీ నిర్వహించారు. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణ సముదాయాలు మూసివేశారు. అనంతరం దళిత నేతలు మాట్లాడారు. గతంలో రిజర్వేషన్ పై వ్యతిరేకంగా తీర్పు ఇచ్చిన సుప్రీం కోర్టు.. ఇప్పుడు ఎలా అనుకూలంగా ఇస్తుందని ప్రశ్నించారు. ఏబీసీడీలు వద్దు–కలిసి ఉండడమే ముద్దు అని నినదించారు. వర్గీకరణ రద్దు అయ్యేంత వరకు పోరాటం చేయనున్నట్లు స్పష్టంచేశారు. కార్యక్రమంలో తుమ్మ రమేష్, నర్సింహ్మా, బిక్షపతి, ప్రశాంత్, అరుణ్ కుమార్, శేఖర్, శ్రీకాంత్, నితీస్, నాగరాజు, గణేశ్, చెన్నయ్య, మల్లేశ్, కిరణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కులాల మధ్య చిచ్చు

ఇబ్రహీంపట్నం: విభజించు పాలించు విధానాన్ని ప్రధాని మోదీ పాటిస్తూ.. కులాల మధ్యచిచ్చు పెడుతున్నారని మాలమహానాడు నేతలు ఆరోపించారు. ఎస్సీ వర్గకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పును నిరసిస్తూ చేపట్టిన భారత్‌బంద్‌లో భాగంగా మాల మహానాడు ఆధ్వర్యంలో పట్నంలో నిరసన వ్యక్తంచేశారు. విద్యాసంస్థలను మూసివేయించారు. బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలువురు మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వర్గీకరణపై వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వద్దు.. కలిసి ఉండటమే ముద్దు అంటూ నినాదాలు చేశారు. మాల మహానాడు నాయకులు మహేశ్, రాములు, జగన్, కృష్ణయ్య, పోచన్న, యాదయ్య పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నేతల నిరసన